క్లుప్తంగా

అన్నదానం



అన్నప్రసాదం స్వీకరిస్తున్న భక్తులు

వీరఘట్టం: స్థానిక పట్టణంలో గణలక్ష్మీ సంతోషిమాత ఆలయ వార్షికోత్సవాల ముగింపు కార్యక్రమం శనివారం జరిగింది. కార్యక్రమంలో భాగంగా మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేశారు. అంతకుముందు యజ్ఞకర్త ఎస్.వి.ఎల్.ఎన్ శర్మయాజీ ఆధ్వర్యంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు.

27, 28 తేదీల్లో ఉచిత ఆధార్ ప్రత్యేక డ్రైవ్

సీతంపేట: మండల కేంద్రంలో ఈ నెల 27, 28వ తేదీల్లో ఉచితంగా ఆధార్ ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు మీసేవా ప్రతినిధి బి.రాము ఓ ప్రకటనలో శనివారం వెల్లడించారు. ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు జరిగే ఈ కార్యక్రమంలో ఐదేళ్లలోపు చిన్నారులకు కొత్తగా ఆధార్ కార్డులు చేయడం, ఆధార్‌లో వివరాల సవరణ చేస్తామని తెలిపారు.

వినియోగంలోకి తాగునీటి బోరు



రేగులపాడు వద్ద బాగు చేసిన తాగునీటి బోరు

వీరఘట్టం: మండలంలోని రేగులపాడు జంక్షన్‌లో మరమ్మతులకు గురైన తాగునీటి బోరును శనివారం బాగుచేసి, వినియోగంలోకి తీసుకువచ్చారు. వేసవి నేపథ్యంలో ప్రయాణికుల దాహార్తి తీర్చేందుకు వీలుగా బోరును బాగు చేసినట్లు సర్పంచ్ మెరుగుల భవాని తెలిపారు.

కొండాపురంలో 'పశువిజ్ఞాన బడి'



మాట్లాడుతున్న పశువైద్యాధికారి సిద్ధార్థ్

పాలకొండ: మండలంలోని కొండాపురం గ్రామ రైతు భరోసా కేంద్రంలో పశువిజ్ఞాన బడి కార్యక్రమం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల పశువైద్యాధికారి బి.సిద్ధార్థ్ వ్యాధుల బారినపడకుండా పశువులను ఎలా సంరక్షించాలో రైతులకు తెలియజేశారు. ఏవైనా అనారోగ్య లక్షణాలతో బాధపడుతున్న మూగజీవాలను వెంటనే పశువుల హాస్పిటల్‌కు తీసుకువెళ్లి, సంబంధిత వైద్యులకు చూపించాలన్నారు. వ్యాధులతో బాధపడుతున్న పశువులకు చికిత్స అందించేందుకు ప్రభుత్వం సంచార పశువైద్య వాహనాలను కూడా ప్రవేశపెట్టిందని, వాటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సచివాలయ వెటర్నరీ అసిస్టెంట్ వెంకటరమణ పాల్గొన్నారు.

డీఎంహెచ్‌ఓ సందర్శన



బాలింతల ఎంసీపీ కార్డులను పరిశీలిస్తున్న డీఎంహెచ్‌ఓ జగన్నాథరావు

వీరఘట్టం: పట్టణంలోని కూరాకుల వీధిలో ఉన్న హెల్త్ సెంటర్‌ను డీఎంఅండ్‌హెచ్‌ఓ బగాది జగన్నాథరావు శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన అక్కడి రికార్డులు, మందుల నిల్వలు పరిశీలించి, అక్కడికి వచ్చే వారికి అందిస్తున్న వైద్యసేవలపై ఆరాతీశారు. రక్తహీనతతో బాధపడుతున్న గర్భిణులు, బాలింతలు, చిన్నారుల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టిసారించాలని సిబ్బందికి సూచించారు. క్రమం తప్పకుండా వారు ఆస్పత్రిని సందర్శించి, మందులు తీసుకునేలా చూడాలన్నారు. అనంతరం బాలింతల ఇంటికి వెళ్లి, వారి ఎంసీపీ(మంత్లీ చెకప్) కార్డులను పరిశీలించి, పలు సూచనలు చేశారు. రోజువారీ ఆహారంలో పౌష్టికాహారం ఉండేలా జాగ్రత్త వహించాలని తెలిపారు. కార్యక్రమంలో వైద్యురాలు ఉమామహేశ్వరి పాల్గొన్నారు.

'ఉరిటి'కి అభినందనలు



ఉరిటి రామారావును సత్కరిస్తున్న శాలివాహన సంఘ నాయకులు

గరుగుబిల్లి: వైఎస్సార్ సీపీ బీసీ సెల్ అధ్యక్షుడిగా నియమితులైన ఎంపీపీ ఉరిటి రామారావును శాలివాహన సంఘ నాయకులు ఉరిటి యాదవ్‌తో పాటు పలువురు అభినందించారు. శనివారం ఆయన ఇంటికి వెళ్లి, పుష్పగుచ్ఛాలు, దుశ్శాలువాతో సన్మానించి, అభినందనలు తెలిపారు.

జాతరకు పోదాం రండి!

- నేటి నుంచి శిర్లి ఎల్లమ్మ జాతర
- అట్టహాసంగా రెండు రోజుల పాటు నిర్వహణ
- 20 నుంచి 30 వేల మంది భక్తులు వస్తారని అంచనా
- ఏర్పాట్లు పూర్తి చేసిన ఆలయ కమిటీ

పాలకొండ రూరల్: భక్తుల కోర్కెలు తీర్చే కల్పవల్లి శిర్లి ఎల్లమ్మతల్లి జాతరకు సర్వం సిద్ధమైంది. పట్టణంలోని శిర్లి పోతన్న వీధిలో ఆది, సోమవారం జరిగే ఈ జాతరకు ఏటా చుట్టుపక్కల ప్రాంతాల నుంచి విశేష సంఖ్యలో భక్తులు విచ్చేసి, అమ్మవారిని దర్శించుకుంటారు. దాదాపు 20 నుంచి 30 వేల వరకు భక్తులు వస్తారని అంచనా. ఈ నేపథ్యంలో భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా అధికార యంత్రాంగం, ఉత్సవ కమిటీ సభ్యులు ఏర్పాట్లు పూర్తి చేశారు.

ఏడో రోజు పవిత్రం..

మహాశివరాత్రి తర్వాతి రోజు నుంచి ఏడు రోజుల పాటు ఎల్లమ్మ జంగిడి తలపై పెట్టుకుని, పట్టణ వీధుల్లోని ఇంటింటికీ పోతురాజు వెళ్లి, జోగి సేకరిస్తుండడం ఆనవాయితీగా వస్తోంది. ఆ తర్వాత అత్యంత పవిత్రంగా భావించే ఏడో రోజున(ఆదివారం) భక్తులు ఎల్లమ్మకు మొక్కులు చెల్లించి, జాగారం చేస్తారు. అదే సమయంలో జాతర ఇతివృత్తాంతంను జముకుల వాని పాట రూపంలో భక్తులకు వివరిస్తారు. అష్టమి తిథి నాడు జరిగే ఈ జాతరలో సింధూర కుండ, పాలజంగిడి ప్రదర్శనలు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తాయి. వీటిని దర్శించుకున్న వారికి మోక్షం లభిస్తుందని ఇక్కడి భక్తుల ప్రగాఢ విశ్వాసం.



పాలకొండ రూరల్: శిర్లి పోతన్న వీధిలో కొలువైన ఎల్లమ్మతల్లి

తిరువీధి ఉత్సవం..

ఆదివారం రాత్రి 7 గంటల నుంచి పోతురాజు స్వామి తిరువీధి ఉత్సవం కనులపండువగా చేపడతారు. రాత్రి 9 గంటలకు స్వామి చరిత్రను జముకుల పాట రూపంలో భక్తులకు తెలియజేస్తారు. సోమవారం మధ్యాహ్నం ఒంటిగంటకు స్వామిలోరి సింధూర కుండ ప్రదర్శన జరుగుతుంది. అదేరోజు రాత్రి 9 గంటలకు పాలజంగిడి ప్రదర్శించి, దర్శనం కల్పిస్తారు. జాతరలో భాగంగా చేపట్టే పలు సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ అలరిస్తాయి. ముఖ్యంగా బొమ్మల కొలువు, సంచార షాపింగ్,




పాలకొండ రూరల్:ముస్తాబైన శిర్లి ఎల్లమ్మ ఆలయం

విద్యుత్ అలంకరణ ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తాయి. భక్తుల సౌకర్యార్థం సత్యసాయి సేవా సమితి సభ్యులతో తాగునీరు, మజ్జిగ అందించడం జరుగుతోంది.

వీరఘట్టంలో 3 రోజులు..

వీరఘట్టం: స్థానిక పట్టణంలో ఆదివారం నుంచి జరిగే శిర్లి యాత్రకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. మార్చి ఒకటో తేదీ వరకు జరిగే ఈ యాత్రకు మండలంలోని చుట్టుపక్కల ప్రాంతాల నుంచి వేల సంఖ్యలో భక్తులు తరలివచ్చి, ఇక్కడి శిర్లి పోతన్న, ఎల్లమ్మతల్లిని దర్శించి, మొక్కులు తీర్చుకుంటారు.



పాలకొండ రూరల్:ఆలయ ప్రాంగణంలో ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్న పోతురాజు విగ్రహం

ఏటా మహాశివరాత్రి గడిచిన వారానికో, పది రోజులకో ఈ యాత్ర నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. యాత్ర రోజున భక్తులు పవిత్ర నదీ స్నానాలు ఆచరించి, కుటుంబ సమేతంగా తాము నివాసముంటున్న వీధిలో ప్రతీ ఇంటికి వెళ్లి, జోగి(బియ్యం సేకరణ) దండుతారు. అలా దండిన జోగిని పోతన్నస్వామికి నైవైద్యంగా సమర్పిస్తారు. అలాగే భక్తులు తమ వెంట తీసుకువచ్చిన గుడ్లను ఎల్లమ్మ పుట్టలో వేసి, పూజలు చేస్తారు. భక్తుల రద్దీ దృష్ట్యా శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా గట్టిబందోబస్తు కూడా ఏర్పాట్లు చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. యాత్రలో భాగంగా శిర్లి పోతన్న, ఎల్లమ్మను దర్శింకుంటే నిత్యం సుఖసంతోషాలతో వర్ధిల్లుతారు. కుష్టు, వివిధ చర్మ వ్యాధులతో బాధపడేవారు దైవ దర్శనం చేసుకుంటే ఆయా వ్యాధుల నుంచి విముక్తి పొందుతారు.

ఎస్.వి.ఎల్.ఎన్.శర్మయాజీ, ప్రముఖ యజ్ఞకర్త, వీరఘట్టం



వీరఘట్టం: భక్తులు పూజించే ఎల్లమ్మతల్లి పుట్ట



వీరఘట్టం: యాత్రకు సిద్ధం చేసిన శిర్లి పోతన్న గుడి

పటిష్ట బందోబస్తు ఏర్పాటు

జాతరలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా గట్టి బందోబస్తు ఏర్పాటు చేశాం. ఇప్పటికే ఆలయం వద్ద, ఆలయ చుట్టుపక్కల పరిసరాల్లో పోలీస్ సిబ్బందిని నియమించి, భద్రతా ఏర్పాట్లు పర్యవేక్షిస్తున్నాం.

–బి.శివప్రసాద్, ఎస్‌ఐ

బ్యాంకు రుణాలను సద్వినియోగం చేసుకోవాలి

- డీఆర్‌డీఏ పీడీ పి.కిరణ్‌కుమార్

వీరఘట్టం: డ్వాక్రా గ్రూపు మహిళలకు ప్రభుత్వం అందిస్తున్న బ్యాంకు లింకేజీ రుణాలను సద్వినియోగం చేసుకోవాలని డీఆర్‌డీఏ పీడీ పి.కిరణ్ కుమార్ సూచించారు. శనివారం మండలంలోని మహదేవివలస గ్రామంలో మదర్ థెరీసా మహిళా సంఘ సభ్యులతో సమావేశమైన ఆయన వారు తీసుకున్న రుణాలను ఎలా సద్వినియోగం చేసుకోవాలన్న విషయంపై అవగాహన కల్పించారు. జీవనోపాధి మెరుగుపరుచుకునేలా రుణాలను వాడుకోవాలన్నారు. అనంతరం రుణాల ద్వారా వచ్చిన నగదుతో ఎలా ఉపాధి అవకాశాలు సృష్టించుకుంటున్నారన్న దానిపై సభ్యులు మాట్లాడారు. ఇదిలా ఉండగా, తీసుకున్న రుణాలను సకాలంలో చెల్లించడం ద్వారా మరో సంఘానికి చెందిన మహిళలకు రుణాలు అందించి, వారి జీవనోపాధి మెరుగుపరిచిన వారమవుతామని ఆయన అన్నారు. కార్యక్రమంలో ఏపీఎం జి.శివున్నాయుడు తదితరులు పాల్గొన్నారు.



డ్వాక్రా గ్రూపు మహిళలకు సూచనలిస్తున్న డీఆర్‌డీఏ పీడీ కిరణ్‌కుమార్

ప్రజలకు మెరుగైన వైద్యసేవలు

- డీఎంహెచ్‌ఓ బగాది జగన్నాథరావు

పాలకొండ: గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలకు సైతం మెరుగైన వైద్యసేవలు అందేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని డీఎంఅండ్‌హెచ్‌ఓ బగాది జగన్నాథరావు అన్నారు. మండలంలోని వెలగవాడ గ్రామంలో శనివారం పర్యటించిన ఆయన ఇంటింటికీ వెళ్లి, ప్రభుత్వ వైద్య సేవలు అందుతున్న తీరుపై ఆరాతీశారు. ముఖ్యంగా 108, 104 వాహన సేవలు, ఫ్యామిలీ డాక్టర్ సేవలు ఎలా అందుతున్నాయని గ్రామస్తులను అడిగి తెలుసుకున్నారు. దీర్ఘకాల వ్యాధులతో బాధపడుతున్న వారి వద్దకు వెళ్లి, గ్రామంలోనే అన్ని రకాల వైద్యసేవలు అందుతున్నాయని, వాటిని సద్వినియోగం చేసుకుని, ఆరోగ్యం మెరుగుపరుచుకోవాలని తెలిపారు. అనంతరం అన్నవరం పీహెచ్‌సీ వైద్యాధికారి కమలనాథ్ ప్రతీ గ్రామంలో అందిస్తున్న వైద్య సేవలను వివరించారు.



వెలగవాడలో ఇంటింటికీ వెళ్లి, వైద్యసేవలపై ఆరా తీస్తున్న డీఎంహెచ్‌ఓ జగన్నాథరావు

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి



వాహనదారులకు అవగాహన కల్పిస్తున్న ఎస్‌ఐ అమ్మాన్‌రావు

భామిని: ప్రతిఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించి, ప్రమాదాల నివారణకు సహకరించాలని బత్తిలి ఎస్‌ఐ వై.అమ్మాన్‌రావు కోరారు. శనివారం మండలంలోని బాలేరు కూడలిలో ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాహనాలతో బయటకు వచ్చేటప్పుడు తప్పనిసరిగా వాహన సంబంధిత ధ్రువపత్రాలు వెంట తీసుకురావాలన్నారు. అలాగే పరిమితికి మించి ప్రయాణికులు, లోడుతో ప్రయాణించరాదన్నారు. మద్యం తాగి, సెల్ ఫోన్ మాట్లాడుతూ వాహనాలు నడపవద్దన్నారు. అలాగే మైనర్లకు వాహనాలు ఇవ్వవద్దన్నారు. ఎవరైనా నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అనంతరం శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ప్రాణాలు పోగొట్టుకున్న ఆరిక జీవన్ ఇంటికి వెళ్లి, బాధిత కుటుంబ సభ్యులను ఎస్‌ఐ పరామర్శించారు.

సమస్యను సామరస్యంగా పరిష్కరించుకుందాం

గుమ్మలక్ష్మీపురం:

ఆంధ్రా–ఒడిశా సరిహద్దులో నెలకొన్న భూ వివాద సమస్యను సామరస్యంగా పరిష్కరించుకుందామని ఎంపీపీ కుంబురుక దీనమయ్య అన్నారు. ఒడిశా సరిహద్దున ఉన్న కేదారిపురం గ్రామస్తులు సరిహద్దు భూ భాగంలో ఉపాధి హామీ పనులు చేస్తుండగా, అక్కడి ఒడిశా వాసులు ఇది ఒడిశా భూ భాగమని, ఇక్కడ పనులు చేపట్టకూడదని అభ్యంతరం వ్యక్తం చేస్తూ పనులకు అడ్డుకున్నారు. శనివారం ఇదే సమస్యపై రామన్నగూడ(ఒడిశా) తహసీల్దార్ నిర్మల్ చంద్ర సాహు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ కైవల్‌కుమార్ పాఢి, సర్వేయర్ ఎం.హేమలత, ఎంపీపీ కమల్ లోచన్ ముట్టిక గుమ్మలక్ష్మీపురం తహసీల్దార్ జె.రాములమ్మ, ఎంపీపీ కుంబురుక దీనమయ్య వద్దకు వచ్చి, చర్చించారు. ఇరు రాష్ట్రాల్లో ఆ ప్రదేశానికి సంబంధించిన మ్యాపులను క్షుణ్ణంగా పరిశీలించారు. అనంతరం ఎంపీపీ దీనమయ్య, తహసీల్దార్ రాములమ్మ మాట్లాడుతూ తామే స్వయంగా ఆ ప్రదేశానికి వచ్చి, క్షేత్ర స్థాయిలో పరిశీలన చేసిన తర్వాత వివాదం పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని, అంతవరకు సంయమనం పాటించాలని కోరారు. సమావేశంలో రజక కార్పొరేషన్ డైరెక్టర్ గోరిశెట్టి గిరిబాబు తదితరులు ఉన్నారు.



భూ వివాదంపై చర్చిస్తున్న ఆంధ్రా, ఒడిశా అధికారులు, నేతలు

చురుగ్గా ఈ-క్రాప్ నమోదు



గురండి గ్రామంలో ఈ-క్రాప్ నమోదు చేస్తున్న సిబ్బంది

భామిని: రబీ సీజన్ పంటలకు సంబంధించి, మండల వ్యాప్తంగా ఈ-క్రాప్ నమోదు ప్రక్రియ చాలా చురుగ్గా సాగుతోంది. విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్లంతా గ్రామ గ్రామానికి వెళ్లి, రైతులతో ఈకేవైసీ చేయించి, వారు సాగు చేస్తున్న పంటల వివరాలను నమోదు చేస్తున్నారు. అనంతరం ఈకేవైసీ, ఈ-క్రాప్ నమోదు ద్వారా రైతులకు కలిగే ప్రయోజనాలను వివరిస్తున్నారు. వరి, చెరకు, మొక్కజొన్న, కూరగాయ పంటలకు సంబంధించి, ఈ-క్రాప్ నమోదు చేస్తున్నట్లు వారు తెలిపారు.

ఎమ్మెల్యే పరామర్శ



బాధిత కుటుంబాన్ని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే పుష్పశ్రీవాణి

కొమరాడ: మండలంలోని తొడుము గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ నాయకుడు బొత్స సత్యంనాయుడు కుమారుడు అరుణ్‌కుమార్ అనారోగ్యంతో ఇటీవల మృతి చెందాడు. ఈ విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే పాముల పుష్పశ్రీవాణి శనివారం ఆ గ్రామం వెళ్లి, బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. పార్టీ పరంగా అన్ని విధాలా ఉంటామని భరోసా ఇచ్చారు. ఎమ్మెల్యే వెంట ఎంపీపీ శెట్టి శ్యామల, సర్పంచ్ యేగిరెడ్డి సింహాచలం ఉన్నారు.

అభివృద్ధి పనుల నాణ్యత పరిశీలన



బల్లేరుగూడలో సైడ్ వాల్ నిర్మాణ నాణ్యతను పరిశీలిస్తున్న ఐటీడీఏ పీఓ విష్ణుచరణ్

జియ్యమ్మవలస/కురుపాం: జియ్యమ్మవలస మండలంలోని బల్లేరుగూడ, కురుపాం మండలంలోని గెడ్డగూడ గ్రామంలో చేపట్టిన పలు అభివృద్ధి పనుల నాణ్యతను ఐటీడీఏ పీఓ విష్ణుచరణ్ శనివారం పరిశీలించారు. ప్రధానంగా అక్కడి కొండనీరు గ్రామాల్లోకి రాకుండా నిర్మించిన రక్షణ గోడ(సైడ్ వాల్)లు, డ్రైనేజీ నిర్మాణాల నాణ్యతను గమనించారు. పనుల్లో నాణ్యత లోపించినట్లు తేలితే చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. అనంతరం మొండెంఖల్ ఆశ్రమ పాఠశాలలో నిర్మిస్తున్న పాఠశాల భవనాలను చూసి, నిర్మాణ పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని కోరారు.

ఉగాదికి సామూహిక గృహప్రవేశాలు

పాలకొండ రూరల్: ఉగాది పండగ రోజున జగనన్న కాలనీల్లో పెద్దఎత్తున సామూహిక గృహప్రవేశాలు జరిగేలా చర్యలు తీసుకోవాలని గృహ నిర్మాణ శాఖ ఈఈ టి.రమేష్ అన్నారు. హౌసింగ్ డే కార్యక్రమంలో భాగంగా శనివారం పట్టణంలోని జగనన్న కాలనీలో ఇళ్ల నిర్మాణాలను పరిశీలించిన ఆయన, లబ్ధిదారులతో నిర్మాణాలను వేగవంతం చేయించాలని సిబ్బందికి సూచించారు. శ్లాబ్ దశలోని నిర్మాణాలను పూర్తి చేసేందుకు చొరవ తీసుకోవాలన్నారు. ప్రభుత్వం కూడా అన్ని విధాలా నిర్మాణాలకు సహకరిస్తున్నందున లబ్ధిదారులు కూడా నిర్మాణాల పూర్తిపై దృష్టిసారించాలని కోరారు. ఆయన వెంట నగరపంచాయతీ కమిషనర్ ఎస్.సర్వేశ్వరరావు, హౌసింగ్ ఏఈ మాధవరావు ఉన్నారు.



లబ్ధిదారులతో మాట్లాడుతున్న గృహ నిర్మాణ శాఖ ఈఈ రమేష్

చిన్నచిన్న భూ వివాదాలు గ్రామాల్లోనే పరిష్కరించుకోవాలి



గురండి గ్రామస్తుల భూ వివాద సంబంధిత పత్రాలు పరిశీలిస్తున్న తహసీల్దార్ అప్పారావు

భామిని: గ్రామీణ ప్రాంతాల్లో తలెత్తే చిన్నచిన్న భూతగాదాలను వీలైనంత వరకు గ్రామాల్లోనే పరిష్కరించుకోవాలని తద్వారా అందరి విలువైన సమయం వృథా కాకుండా ఉంటుందని తహసీల్దార్ నీలాపు అప్పారావు సూచించారు. భూ వివాద పరిష్కారమై శనివారం తహసీల్దార్‌ను ఆశ్రయించిన మండలంలోని గురండి గ్రామానికి చెందిన ఇరువర్గాలను ఆయన సముదాయించారు. చిన్నాచితకా తగాదాలకు కోర్టు మెట్లు ఎక్కవద్దని, దాంతో ఇరువురికీ నష్టమే తప్ప లాభం ఉండదన్నారు. గ్రామపెద్దల సమక్షంలో తగాదాలు పరిష్కరించుకునేందుకు చొరవ చూపాలన్నారు.

ఆరోగ్య కేంద్రంలో ఆకస్మిక తనిఖీలు

కురుపాం: స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని పార్వతీపురం మన్యం జిల్లా మలేరియా నివారణ అధికారి శ్యామ్‌కుమార్ శనివారం సందర్శించి, ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. తొలుత అక్కడి రికార్డులు పరిశీలించి, రోగులకు అందిస్తున్న సేవల వివరాలపై సిబ్బందిని ఆరాతీశారు. ల్యాబ్, బ్లడ్‌బ్యాంకు గదులు, ఐసీటీసీ సేవలను వైద్యురాలు శోభారాణిని అడిగి తెలుసుకున్నారు. కేంద్రానికి వచ్చే రోగులను గౌరవించి, వారికి కావాల్సిన వైద్యసేవలను అందివ్వాలని ఆయన సూచించారు. అనంతరం కురుపాం, శివ్వన్నపేట హెల్త్ సబ్‌సెంటర్లను సందర్శించిన ఆయన అక్కడి సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఆయన వెంట డిప్యూటీ డీఎంహెచ్‌ఓ గంట వెంకటరమణ ఉన్నారు.



రోగుల సేవలపై ఆరాతీస్తున్న జిల్లా మలేరియా నివారణ అధికారి శ్యామ్‌కుమార్

'ఉపాధి' వేతనాలు పెంచాలి



ఉపాధి వేతనదారులను కలిసిన సీపీఐ నాయకులు

కురుపాం: ఉపాధి హామీ పనుల వేతనదారులకు ఇచ్చే వేతనాలు పెంచాలని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి తోట జీవన్న, డీఎస్‌పీఎస్ జిల్లా అధ్యక్షుడు ఎస్.సింహాచలం, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కోశాధికారి పువ్వల ప్రసాద్ డిమాండ్ చేశారు. శనివారం మండలంలోని కొత్తమంత్రజోల గిరిజన గ్రామంలో జరుగుతున్న ఉపాధి హామీ పనులను పరిశీలించిన వారు, వేతనాలు ఎలా అందుతున్నాయని వేతనదారులను అడిగి తెలుసుకున్నారు. గిట్టుబాటు అయ్యే వేతనం రావడం లేదన్న వారి మాటలు విన్న వీరు వేతనదారులకు సరిపడ వేతనం వస్తే వలస వెళ్లరన్నారు. కనీసం కుటుంబాన్ని పోషించుకునేందుకు సరిపడ డబ్బులు కూడా రాకపోతే గ్రామంలో ఎలా జీవించాలన్నారు. ప్రస్తుతం పెరిగిన రేట్లకు అనుగుణంగా వేతనాలు పెంచాలని కోరారు.

మహిళలు ఆర్థికంగా ఎదగాలి

జియ్యమ్మవలస: మహిళలు ఆర్థికంగా ఎదగాలని డీఆర్‌డీఏ పీడీ కిరణ్‌కుమార్ ఆకాంక్షించారు. శనివారం మండలంలోని గవరమ్మపేట పంచాయతీలో ఉన్న ఎరకలపేటలో డ్వాక్రా మహిళా సంఘాల సభ్యులతో సమావేశమైన ఆయన ఏకలవ్య గ్రూపు సభ్యులకు మంజూరు చేసిన రూ.10 లక్షల రుణం ఎలా సద్వినియోగం చేసుకున్నారో అడిగి తెలుసుకున్నారు. వెదురు కర్రలతో చాపలు, కోళ్లగూడెలు తయారు చేసి, అమ్ముకుని జీవిస్తున్నామని సమాధానమిచ్చారు. అనంతరం చినమేరంగిలో ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్‌ను పరిశీలించి, సిబ్బందికి పలు సూచనలు చేశారు.



మాట్లాడుతున్న డీఆర్‌డీఏ పీడీ కిరణ్‌కుమార్

పచ్చిరొట్టతో నేల సారవంతం

గరుగుబిల్లి: పొలాల్లో పచ్చిరొట్ట ఎరువులు వేసుకోవడం ద్వారా నేల సారవంతమవుతుందని, తద్వారా ఆరోగ్యవంతమైన పంట, అధిక దిగుబడి వస్తుందని మండల వ్యవసాయాధికారి ఆర్.విజయభారతి తెలిపారు. శనివారం మీడియాతో మాట్లాడిన ఆమె పచ్చిరొట్ట ఎరువుల్లో అనేక రకాలు ఉన్నాయని, కట్టిజనుము, పిల్లిపెసర, జీలుగు వంటివి వేసుకుని, 40 రోజుల పాటు పొలంలో పెంచి, దుక్కి చేస్తే నేల సారం బాగుంటుందన్నారు. పచ్చిరొట్ట ఆ తరువాత పచ్చిరొట్టను పొలంలో దుక్కి రూపంలో గాని, దమ్ము రూపంలోగాని కలియదున్నితే చేనుకు బలం చేకూరుస్తాయన్నారు. పచ్చిరొట్ట ఎరువుల్లో జనుము వేసుకుంటే నేల చౌడు తగ్గి, భూసారం పెరుగుతుందన్నారు.

బి: భూ
, ఒడిశా